క్లుప్తంగా

సర్వే పరిశీలన

చుంచుపల్లి: మండలంలోని రుద్రంపూర్ గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఇంటింటి సమగ్ర సర్వే తీరును డీఎల్‌పీఓ రమణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది తగు సూచనలు చేశారు. సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని చెప్పారు. ప్రతీ కుటుంబం వివరాలను సమగ్రంగా అడిగి నమోదు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలో పూర్తయిన సర్వే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీఓ సత్యనారాయణ, కార్యదర్శి నరేందర్ ఉన్నారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రపై నేడు కళారూపం ప్రదర్శన

ఇల్లెందు: అభ్యుదయ ఆర్ట్ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర మీద గురువారం సాయంత్రం పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో కళారూపం నిర్వహిస్తున్నట్లు సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. బుధవారం ఇల్లెందులో మాట్లాడుతూ... డాక్టర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర, ఆశయాలు, లక్ష్యాలు అనే అంశం మీద రూపొందించిన కళారూపం, సంఘం శరణం గచ్ఛామీ అనే కళారూపాన్ని ప్రదర్శిస్తారని తెలిపారు. సింగరేణి ఉద్యోగులు, పట్టణ ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వ్యవసాయ వ్యర్థాలను కాల్చొద్దు

టేకులపల్లి: ఇల్లెందు డివిజన్‌లో వరి, పత్తి కోత దశలో ఉంది కాబట్టి చాలామంది రైతులు వరి కొయ్యలు, పత్తి కట్టెలు కాల్చుతూ రెండో పంటకు వెళ్తుంటారని ఆ విధంగా చేయడం వలన చాలా అనర్థాలు జరుగుతాయని వ్యవసాయ శాఖ ఇల్లెందు డివిజన్ అధికారి గుగులోత్ లాల్‌చంద్ అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండలంలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం వలన వాతావరణంలో కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్ వంటి విష వాయువులు వెలువడి మానవాళికి వివిధ రకాల వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. అదే విధంగా సేంద్రియ కర్బనం భూమిలోని సూక్ష్మ జీవులు నశించిపోయాతని, తద్వారా పంటలకు తెగుళ్లు, చీడపడలు ఆశిస్తాయన్నారు.

అభివృద్ధికి సహకరించండి..


టేకులపల్లి: మాట్లాడుతున్న జిల్లా అధికారి సయ్యద్ ఖుర్షీద్

సుజాతనగర్: సహకార రంగం అభివృద్ధికి ప్రతీ రైతు తమ వంతు సహకారం అందించాలని సొసైటీ చైర్మన్ మండె హనుమంతరావు అన్నారు. సహకార సంఘం 71వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు వేడుకలను సుజాతనగర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ఆర్థికంగా, సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు సహకార వ్యవస్థ ఏర్పడిందన్నారు. సొసైటీ డైరెక్టర్ తీట్ల విజయకుమారి, రైతులు మండె సత్యం, కొమారి రవీందర్, సుధాకర్‌రావు, మండె వెంకటస్వామి, కొమారి నర్సింహారావు పాల్గొన్నారు.

టేకులపల్లి: 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు బుధవారం టేకులపల్లిలోని బేతంపూడి సహకార సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు, సాంఘిక బాధ్యత, సభ్యుల మధ్య సమానత్వం, సంఘాల అభివృద్ధి గురించి వివరించారు. బేతంపూడి సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజేష్, ఇన్‌స్పెక్టర్ కనకదుర్గా, డీసీసీబీ మేనేజర్ విజయ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

శంకుస్థాపనకే పరిమితం!

- 8 నెలలుగా ప్రారంభం కాని బ్రిడ్జి పనులు
- సురారం సాగు భూములన్నీ వాగు అవతలి వైపే
- రైతులు, కూలీలకు తప్పని తిప్పలు..
- పట్టించుకోని అధికారులు, పాలకులు


సురారం వద్ద బండల రేవు వాగు దాటుతున్న మహిళా కూలీలు

జూలూరుపాడు: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం సురారం బండల రేవు వాగుపై బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేసి పనుల ప్రారంభం మరిచారు. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులకు మాత్రం మోక్షం కలగడం లేదు. వాగుపై బ్రిడ్జి, సీసీ రోడ్డు నిర్మాణానికి ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు రూ.1.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. 2024 పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని అధికారులు హడావుడిగా మార్చి 14న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతులు మీదుగా శంకుస్థాపన చేయించారు. ఎనిమిది నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఎన్నో ఏళ్లుగా సురారం గ్రామ సమీపంలో ఉన్న బండల రేవు వాగుపై బ్రిడ్జి లేక ఆ గ్రామ ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో రైతులు, కూలీలకు అవస్థలు పడుతున్నారు. కనకగిరి అటవీ ప్రాంతంలో ఉన్న సురారం గ్రామంలోని ప్రజలంతా వ్యవసాయ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. గ్రామంలో 328 కుటుంబాలు, జనాభా 1,199. నిత్యం పొలాలకు రైతులు, కూలీలు వాగు దాటి వెళ్లాలి. వానాకాలంలో వాగు దాటి పొలాలకు వెళ్లాలన్నా, తిరిగి ఇళ్లకు రావాలన్నా వారి బాధలు వర్ణనాతీతం. ఏ కొద్దిపాటి వర్షం కురిసినా గ్రామ సమీపంలోని కనకగిరి అటవీ ప్రాంతంలోని ఎత్తైన గుట్టల మీదుగా వచ్చే వరదతో బండల వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో పొలం పనులకు వెళ్లిన రైతులు, కూలీలు వాగు ఉధృతి తగ్గే వరకు అవతలి వైపు గంటల తరబడి బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి. తోళ్ల వాగు, ఎర్రవాగుల వరదనీరు వచ్చి గ్రామ సమీపంలో ఉన్న బండల వాగులో కలుస్తుండటంతో ఈ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుందని రైతులు, కూలీలు చెబుతున్నారు. భారీ, అతిభారీ వర్షాలు కురిస్తే పంట పొలాలకు వెళ్లే పరిస్థితి ఉండదని, ఒక్కోసారి వరదంతా గ్రామంలోని ఇళ్లలోకి కూడా వచ్చి చేరుతుందని బాధితులు వాపోతున్నారు. ఆకాశంలో కారు మేఘాలు కమ్ముకుంటే పొలం పనులకు వెళ్లిన వారంతా వర్షం రాకముందే పరుగుపరుగున ఇంటి దారి పట్టాల్సిందేనని, లేదంటే వాగు దాటే అవకాశం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పశువులు, మూగజీవాలు మేత కోసం పొలాలకు వెళ్లడం కష్టంగా ఉందన్నారు. ఎండ్ల బండ్లు, ద్విచక్ర వాహనాలు, ట్రాలీలు, ట్రాక్టర్లపై ఎరువులు తీసుకెళ్లడం కష్టతరమన్నారు. తుఫాన్లు, రుతుపవనాల ప్రభావంతో రోజుల తరబడి ముసురు పెడితే కనీసం పంటలను చూడటానికి వెళ్లాలన్నా వాగు దాటే పరిస్థితి ఉండదని, వాగుపై వంతెన నిర్మిస్తే ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మా కష్టాలు తీరుతాయని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెన, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై జూలూరుపాడు ఐటీడీఏ ఏఈ వెంకట నాగప్రసాద్ వివరణ కోరగా... బ్రిడ్జి టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామన్నారు.

వాగు దాటడం ఇబ్బందిగా ఉంది..



వాన కురిస్తే ఆడవాళ్లు వాగు దాటడం ఇబ్బందిగా ఉంటుం పంట పొలాలకు వెళ్లాలంటే వేరే మార్గం లేదు. ఎవరో ఒకరి సాయంతో వాగు దాటడం జరుగుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగుపై వంతెన ప్రారంభించేలా కృషి చేయాలి.– మూడ్ సుశీల, మహిళా రైతు, సురారం

వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది..



తాతల కాలం నుంచి బండల రేవు వాగు దాటి పొలాలకు వెళ్లున్నాం. వానా కురిస్తే వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సి వస్తుంది. పశువులు మృత్యువాత పడటంతోపాటు, కొందరు ప్రాణపాయ స్థితి నుంచి బయటపడ్డ సంఘటనలు ఉన్నాయి.

– మాలోత్ లక్ష్మణ్, రైతు, సురారం

శంకుస్థాపన చేస్తే సంతోషించాం..



బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే సంతోషించాం. కానీ నెలలు గడుస్తున్నా పనులు చేపట్టలేదు. ఏ కొద్దిపాటి వాన కురిసినా గుట్టలపై నుంచి వచ్చే వరదకు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలి.

– బానోత్ రమేష్, రైతు, సురారం

ఆర్థికాభివృద్ధి సాధించండి..


చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే కనకయ్య, అధికారులు, సొసైటీ నిర్వాహకులు

టేకులపల్లి: ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న చేప పిల్లలను వృద్ధి చేసి మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రోళ్లపాడు చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో వంద శాతం సబ్సిడీపై అందజేసిన 66 వేల చేప పిల్లలను చెరువులో వదిలారు. డీటీ ముత్తయ్య, కోరం సురేందర్, ఈది గణేష్, బానోతు భద్రు, మత్స్య సొసైటీ నిర్వాహకులు చీమల రామయ్య, చీమల లక్ష్మీనారాయణ, రాములు, గణేష్, బానోతు రవి, భూక్యా సర్దార్ పాల్గొన్నారు.

ఎర్రజెండా పేదల పక్షం

సుజాతనగర్: పేదల కష్టం ఉన్నంత వరకు ఎర్రజెండా ఉంటుందని సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య అన్నారు. బుధవారం సుజాతనగర్‌శాఖ ఆధ్వర్యంలో సుజాతనగర్ మెయిన్ రోడ్డు నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఐలయ్య మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయిందని ఆరోపించారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయలేదని, రైతుబంధును రూ.15000, కూలీ బంధు రూ.1200 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లిక్కి బాలరాజు, కున్సోతు ధర్మా, వీర్ల రమేష్, కాట్రాల తిరుపతిరావు, బచ్చలికూర శ్రీను, గండమల్ల భాస్కర్ పాల్గొన్నారు.

కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి..



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నేతలు

ఇల్లెందు: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. బుధవారం ఇల్లెందు ఆర్టీసీ డిపో ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో సీటీటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కార్మిక సంఘాల మీద ఆంక్షలు విధించిందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలకు పాలకులు చరమగీతం పాడారని తెలిపారు. ఆర్టీసీలో యాజమాన్యం కార్మికుల మీద పనిభారం మోపుతోందన్నారు. సింగిల్ డ్యూటీల నుంచి డబుల్ డ్యూటీలకు ఒత్తిడి చేయటం తగదన్నారు. మహిళా కార్మికులకు రాత్రి కూడా డ్యూటీల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. డ్యూటీలకు దూరంగా ఉన్న కార్మికులను సెలవులు ఇవ్వమని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. పని ఒత్తిడి వల్ల ఆర్టీసీలో యాక్సిడెంట్లు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆర్టీసీలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించిందని, ఏడాది కావొస్తున్నా ఎన్నికల ఊసే లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం అడుగు జాడల్లోనే ఈ ప్రభుత్వం నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, నాగరాజు, సత్యనారాయణ కోరీ, లక్ష్మణ్, కోటేశ్వరరావు, శ్రీనివాస్, హుస్సేన్, సుల్తానా, మరియా, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో కారుణ్య నియామకాలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు డీజీఎం వెల్ఫేర్ గడిపెల్లి రాజేంద్రప్రసాద్ బుధవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. మాట్లాడుతూ.. ఎంపికైన వారిని మెడికల్‌కు పంపించి అందులో సెలక్ట్ అయిన వారిని ఎంవీటీసీ ట్రెనింగ్‌కు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం జీకే కిరణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ సాయి స్వప్నిల్, అధికారులు, కార్మికుల పిల్లలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంఅర్బన్: గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలుగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా కొత్తగూడెం అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలతో వారిలో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగు చూస్తుందని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్‌స్వామి, ఇన్‌చార్జ్ తహసీల్దార్, డీఈ రవికుమార్, గ్రంథాలయ కార్యదర్శి వి.అర్జున్, గ్రంథాలయ ఇన్‌చార్జ్ ఎం.నవీన్, గ్రంథపాలకులు మణిమృదుల, మధుబాబు, రుక్మిణి, గీత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు పూర్తయితే ఎర్రగుంటకి మహర్దశ..

పాల్వంచ: ఎర్రగుంట చెరువు సమస్యకు త్వరలో పరిష్కారం చూపిస్తానని, ఇక్కడ బైపాస్ రోడ్డు పూర్తయితే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంటను సందర్శించిన ఆయన పలు సమస్యల పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు. తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ రాణితో పాటు ఎస్.కే.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, వై.వెంకట్రామయ్య, వెంకన్న, సత్యనారాయణ, ఆదినారాయణ, లాల్‌పాషా, ప్రసాద్, శంకర్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



పాల్వంచరూరల్: విద్యార్థులతో గైడ్ టీచర్లు


కొత్తగూడెంరూరల్: విద్యార్థులను అభినంధిస్తున్న వీరేంద్రచౌదరి

పాల్వంచరూరల్: అన్నపురెడ్డిపల్లిలోని గురుకుల పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్వంచ మండలంలోని జగన్నాథపురం పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ చూపి ప్రథమ స్థానం సాధించారు. 8వ తరగతి విద్యార్థి డి.విజయనాయక్ మ్యాథమెటికల్ మోడలింగ్ కాంపిటేషన్ థికింగ్, జూనియర్ విభాగంలో ప్రైమరీ నంబర్ సిస్టం ఇన్ వన్ ఫ్రేమ్ అనే ప్రాజెక్టును ప్రదర్శించి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాడు. బి.అక్షయ ఫుడ్ హెల్త్ అండ్ హైజీన్ సబ్‌థీమ్‌లో మెడిసినల్ ప్లాంట్స్ అనే ప్రాజెక్టులో ప్రథమ బహుమతిని గెలుచుకుంది. వీరిద్దరినీ హెచ్‌ఎం, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఉజ్వల్

కొత్తగూడెంరూరల్: అన్నపురెడ్డిపల్లిలో నిర్వహించిన బాలల వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్‌ఫేర్)లో లక్ష్మీదేవిపల్లిలోని త్రివేణి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఉజ్వల్ రాణా మనక్ జిల్లా ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకాగా, లక్ష్మీరిషిత కన్సోలేషన్ బహుమతి సాధించింది. వీరిని బుధవారం డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి అభినందించారు.

బీఆర్‌ఎస్ బలోపేతంపై దృష్టి


కేటీఆర్‌ను కలిసిన రాజుగౌడ్

పాల్వంచ: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ బుధవారం హైదరాబాద్‌లోని నంది హిల్స్‌లోని కేటీఆర్ నివాస గృహంలో కలిశారు. కొత్తగూడెం నియోజకవర్గ సమస్యలు, పరిస్థితులను కేటీఆర్‌కు వివరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. జనవరి తర్వాత పార్టీలో సంస్థాగత మార్పులు, పార్టీ బలోపేతంపై కేసీఆర్ దృష్టి సారిస్తారని తెలిపారని, ఇప్పుడు పనిచేసే వారే నిజమైన బలగం అని, భవిష్యత్‌లో వారికి సముచిత స్థానం ఉంటుందని పేర్కొన్నారని రాజు గౌడ్ తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం


పనులు చేపడుతున్న దృశ్యం

ఇల్లెందు: ఎట్టకేలకు ఇల్లెందులపాడు హిందూ శ్మశానవాటిక పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. రెండేళ్లుగా వాగు ఉధృతికి బ్రిడ్జి కొట్టుకపోవడంతో శవాలను వాగు దాటించటం కష్టంగా మారింది. అంత్యక్రియలను స్థానికులు పడుతున్న ఇబ్బందులను పలుమార్లు సాక్షి వెలుగులోకి తెచ్చింది. స్థానిక కౌన్సిలర్ కటకం పద్మావతి చొరవతో తాత్కాలిక ఐరన్ బ్రిడ్జి పనులను చేపట్టారు. సింగరేణి జీఎం జాన్ ఆనంద్ సహకారంతో ఐరన్ పైపులతో తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. కేవలం వర్షాకాలంలో వాగు దాటడం కష్టంగా మారినందున ఈ తాత్కాలిక ఇనుప వంతెనను ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ డీఈ మురళీ, వర్క్ఇన్‌స్పెక్టర్ నరసింహారావు పనుల పనులను పర్యవేక్షిస్తున్నారు.

రాజశేఖర్ కృషి అభినందనీయం


రాజశేఖర్‌ను అభినందిస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంటౌన్: మొక్కలను నాటండీ పర్యావరణాన్ని పరిరక్షించండి.. అని ప్రకృతి ప్రేమికుడు చేస్తున్న సేవలు అభినందనీయమని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాయలంలోని ఆయన చాంబర్‌లో మొక్కల ప్రేమికుడు, పర్యావరణ ప్రేమికుడు కొట్టూరి సూర్వి రాజశేఖర్ డీఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ను అభినందించారు. డీఎస్పీ మాట్లాడుతూ... మొక్కలను నాటుతూ ప్రకృతిని సంరక్షించడానికి తమ వంతు కృషి చేస్తున్న మొక్కల రాజశేఖర్‌ను దేశ ప్రధాని గుర్తించడం చాలా గర్వించదగిన విషయం అన్నారు. ప్రతీరోజు మొక్కలను నాటుతూ మరోకరితో నాటిస్తూ ప్రకృతి దీక్షను చేపట్టి అందరినీ మొక్కలను నాటేలా చేయడం మంచి విషయమన్నారు. ప్రతీరోజు 1,604 రోజుల నుంచి క్రమం తప్పకుండా మొక్కలను నాటుతూ మొక్కలపై తన ప్రేమను చాటుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కొత్తగూడెం ప్రెసిడెంట్ షేక్ దస్తగిరి, యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ, యోగా గురువు కొచ్చర్ల కమలారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీల అమలుకు కట్టుబడి ఉంది..


మాట్లాడుతున్న రంగారావు

పాల్వంచ: ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి కావొస్తున్న సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలంతా సంతోషంగా ఉంటున్నట్లు చెప్పారు. మధు, మాలోతు కోటి నాయక్, ధర్మసోతు ఉపేందర్, లక్ష్మణ్, రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచానికి కమ్యూనిజమే దిక్సూచి..


మాట్లాడుతున్న కిరణ్

ఇల్లెందు: ప్రజా ఉద్యమాలతో సీపీఎంను బలోపేతం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ అన్నారు. బుధవారం నూతన కార్యదర్శిగా కిరణ్ ఎన్నికను ప్రకటించారు. సీపీఎం మండల కార్యాలయం ఏలూరి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిజానికి కాలం చెల్లిందనే రోజుల నుంచి కమ్యూనిజం లేనిదే కాలం గడిచే అవకాశం లేదన్నట్లు మారిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులకు ఆదరణ పెరిగిందని తెలిపారు. డిసెంబర్ 20, 21 తేదీల్లో ఇల్లెందులో సీపీఎం జిల్లా మహాసభలు జరుగబోతున్నాయని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతోన్మాద విధానాలను అవలంభిస్తోందని, బీజేపీని నివారించేందుకు సీపీఎం బలమైన ఇండియా కూటమిని ఏర్పాటు చేసిందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన 780 మంది రైతులు మృతి చెందినట్లు చెప్పారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత నీళ్లు, నిధులు, నియామకాలు మనవే అంటూ అధికారంలోకి వచ్చిన కేసీఆర్, ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నిండా ముంచిందన్నారు. ఈ సమావేశంలో అబ్దుల్ నబీ, కృష్ణ, మోహన్‌రావు, సుల్తానా, ఖాదర్, మాదారపు వెంకటేశ్వర్లు, లక్ష్మి, సంధ్య, రాము పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రామవరం సుభాష్‌చంద్రబోస్ నగర్‌లోని మోడ్రన్ ఇక్రా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ సూచించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థుల చేత మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పర్వీన్‌సుల్తానా, టీచర్లు పాల్గొన్నారు. రామవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాలు, మొబైల్ వినియోగం, సైబర్ క్రైమ్ విషయాల పట్ల ఎస్సై షాహినా అవగాహన కల్పించారు.

టేకులపల్లి: యువతీ, యువకులు, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని ఎంజేపీ బాలుర గురుకులంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం మాదకద్రవ్యాల నియంత్రణ చాలా ముఖ్యమైందన్నారు. అన్ని గ్రామాల్లో డ్రగ్స్‌ని రూపుమాపేందుకు స్థానికులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పోగుల సురేష్, ఎంజేపీ గురుకులం ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందు: విద్యార్థులకు బాల్యం నుంచే క్రమశిక్షణ అవసరమని డీఎస్పీ ఎస్.చంద్రభాను అన్నారు. బుధవారం ఇల్లెందులో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పట్టణంలో మాదకద్రవ్యాల వినియోగానికి యువత విద్యార్థులు దూరంగా ఉండాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ మత్తు పదార్థాల వల్ల ఎన్నో నష్టాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటే మంచిదన్నారు. ఈ ర్యాలీలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు నాగుల్ మీరా, సూర్య ఉన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలు, మొబైల్ వినియోగం, సైబర్ క్రైమ్‌లపై టూ టౌన్ ఎస్ఐ ఎస్‌డీ షాహీనా బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ బుచ్చి రాములు, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాల్వంచ: యువత మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం బొల్లేరుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.


సింగరేణి(కొత్తగూడెం): అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షాహీన్


ఇల్లెందు: మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను


టేకులపల్లి: తడికలపూడి క్రాస్‌రోడ్డు వద్ద మానవహారం చేపట్టిన విద్యార్థులు